11-03-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 171 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి



# ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు

- నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ
- కాంగ్రెస్ కు మద్దతు పలికిన ఎంఐఎం

**జయభేరి, హైదరాబాద్ :**

నామినేషన్ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ నేడు పూర్తి కానుంది. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాల కోసం నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ నుండి అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి, సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసారు. ఇక ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, సీపీఐ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు మద్దతుగా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి మాత్రమే పోటీలో ఉండటంతో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయ కేతనం ఎగరేసిన సంగతి తెలిసిందే.

# 100 శాతం నాణ్యత సంతృప్తి కావాలి



- అధికారులు, ఉద్యోగుల తీరుపై ఎక్కడా ఫిర్యాదులు రాకూడదు
- వర్క్ ఫ్రం హోంపై సర్వే నివేదిక ఆధారంగా నూతన పాలసీ
- రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- వివిధ పథకాల అమల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అధికారులతో సమీక్ష
- ప్రతివారం నాలుగు శాఖల చొప్పున 16 శాఖలపై పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ స్టడీ

**జయభేరి, అమరావతి, మార్చి 10 :**

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో 100 శాతం నాణ్యత కనిపించాలని, లబ్ధిదారుల నుంచి పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం కావాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచడం, ప్రజలు సంతృప్తి చెందేలా కార్యక్రమాలు అమలుచేయడంపై అన్ని స్థాయిల్లో దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్ష చేశారు. వివిధ పథకాల అమల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అధికారులతో అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. ప్రతివారం నాలుగు శాఖలపై సమీక్ష చేస్తున్న సీఎం చంద్రబాబు...ఈ వారం రెవెన్యూ సర్వీసులు, ఆసుపత్రుల్లో సేవలు, దేవాలయాలు, మునిసిపల్ శాఖలోని సేవల్లో వచ్చిన రిపోర్టులపై సమీక్ష చేశారు. పదేపదే ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలని సీఎం ఆదేశించారు. కిందిస్థాయి ఉద్యోగులు, అధికారులకు ఉన్నతాధికారులు కౌన్సలింగ్ నిర్వహించడం ద్వారా సేవలు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విషయంలో ఏమాత్రం సహించవద్దని అదేశాలు ఇచ్చారు. కరెప్షన్ అనేది ఒక జబ్బులాంటిదని, దీన్ని పూర్తిగా నివారించాల్సిందే అని సీఎం అన్నారు.

...మిగతాది 2 లో




# మళ్లీ బంగారం జంప్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 10:**

డాలర్ వీక్‌గా మారడంతో పాటు పసిడిపైపు పెట్టుబడులు పరుగులు పెడుతుండే సరికి గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్ రేటు కాస్త పెరిగింది. ప్రస్తుతం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రా.) బంగారం ధర 2,918 డాలర్ల దగ్గర ఉంది. మన దేశంలో 10 గ్రా. స్వచ్ఛమైన పసిడి (24 కేరెట్లు) ధర 110 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ (22 కేరెట్లు) ధర 100 రూపాయలు, 18 కేరెట్ల బంగారం రేటు 90 రూపాయల చొప్పున పెరిగాయి. ఈ లెక్కన, 100 గ్రా. ప్యూర్ గోల్డ్ (24K) ధర రూ. 1100 జంప్ చేసింది. కిలో వెండి రేటు రూ. 100 తగ్గింది.హైదరాబాద్‌మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,820; 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,500; 18 క్యారెట్ల బంగారం ధర రూ. 65,870 చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో రూ. 1,08,000 గా ఉంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,820; 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర రూ. 80,500; 18 క్యారెట్ల బంగారం ధర రూ. 65,870 చేరింది. ఇక్కడ కిలో వెండి ధర రూ. 1,08,000 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.

# ఆఫ్రికా ఐలాండ్ లో లలిత్ మోడీ



**జయభేరి, ముంబై, మార్చి 10:**

లలిత్ మోడీ విభిన్నమైన వ్యక్తి. వ్యాపార కిటుకులు తెలిసిన వ్యక్తి. పైగా క్రికెట్ కు కార్పొరేట్ రంగులు అద్దిన వ్యక్తి. అందువల్లే ఐపిఎల్ అనేది ఏర్పడింది. ఇంతలా అభివృద్ధి చెందింది. మంచి వెనుక చెడు ఉన్నట్టు.. ఐపీఎల్ ను మానస పుత్రిక లాగా అభివర్ణించుకున్న లలిత్ మోడీ.. ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. ఫలితంగా ఆర్థిక నేరగాడిగా ముద్రపడ్డాడు. చివరికి దేశం విడిచి వెళ్లిపోయాడు. ప్రస్తుతం విదేశాలలో తల దాచుకుంటున్నాడు. అతడిని ఇండియాకి తీసుకురావడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ.. విఫలమవుతూనే ఉన్నాయి.. లలిత్ మోడీ కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్నాడు. ఆ మధ్య అతడు సుస్మితాసేన్ తో కలిసి ఉంటున్నట్టు ప్రచారం జరిగింది. దానికి సంబంధించిన ఫోటోలను కూడా లలిత్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశాడు.చాలా సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్న లలిత్.. తనను ఎప్పుడైనా సరే భారత ప్రభుత్వం స్వదేశానికి తీసుకెళ్లి ఇబ్బంది పడుతుందని భావించి.. ఇంగ్లాండ్ నుంచి కూడా లలిత్ వెళ్లిపోయాడు. ఏకంగా "వనువాటు" అనే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. వనువాటు అనేది 80 ద్వీపాల సమూహం. ఇది పసిఫిక్ మహాసముద్రంలో ఉంటుంది. ఇక్కడ ఆదాయపు పన్ను.. ఇతర టాక్స్ లు ఉండవు. ఈ ప్రాంతం క్రిప్టో కరెన్సీకి స్వర్గధామం గా ఉంది. 2024లో హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్ లో ఈ దేశం తొలి స్థానంలో ఉంది. మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్.. స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోవడానికి వను వాటు వెళ్లినట్టు తెలుస్తోంది.. లలిత్ మొదట్లో ఐపిఎల్ వ్యవహారాలను సక్రమంగానే నిర్వహించినప్పటికీ..

...మిగతాది 2 లో

# అసెంబ్లీకి సారొస్తున్నారు



**జయభేరి, హైదరాబాద్, మార్చి 10:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగారు.. దీంతో సారొస్తారొస్తారు.. అని గులాబీ దళం మాంచి జోష్ మీదున్నది. ఫామ్‌హౌస్ నుంచి ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారనే సంకేతాలొచ్చాయి. ఏప్రిల్ 17న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నేతలతో జరిగిన భేటీలో కీలక సూచనలు చేశారు కేసీఆర్. ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం ద్వారా మళ్లీ ఉద్యమ పంథాలో విజృంభించాలని పథక రచన చేశారా? అందులో భాగంగానే పోరుగడ్డ ఓరుగల్లును పొలిటికల్ పొలికేకకు వేదికగా నిర్ణయించారా? ఇదంతా ఒక వైపు. అంతకన్నా ముందు అసెంబ్లీ సమావేశాలకు కేసీర్ హాజరు కాబోతున్నారనే చర్చ మరో ఎత్తు... అయితే.. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## 100 శాతం నాణ్యత.. సంతృప్తి కావాలి

ఆసుపత్రుల్లో అందించే సేవలపై రోగుల నుంచి ప్రభుత్వం అభిప్రాయం సేకరించింది. డాక్టర్లు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నారా అన్న ప్రశ్నకు 68.6 శాతంమంది ఉంటున్నారని సమాధానమిచ్చారు. డాక్టర్ల ప్రవర్తనపై 71.7 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 65.6 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు రాసిచ్చిన మందులు ఆసుపత్రిలో ఇస్తున్నారా, ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత ఎలా ఉంది అన్న ప్రశ్నల నుంచి కూడా ప్రభుత్వం అభిప్రాయాలు తీసుకుంది. ఈ విభాగంలో 65 శాతం వరకు సంతృప్తి వ్యక్తం అవ్వగా..దీన్ని మరింత మెరుగుపరుచుకోవాలి సీఎం సూచించారు. గత నివేదికలతో పోల్చుకుంటే సేవలు కొంత మెరుగుపడినట్లు చెప్పారు.

అదే విధంగా మున్సిపల్ సేవల నుంచి కూడా అభిప్రాయం తీసుకున్నారు. మీ నుంచి రోజూ చెత్త సేకరిస్తున్నారా, మీ పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోపు తొలగిస్తున్నారా అనే అంశాలపై సమాచారం సేకరించారు. ఈ విషయంలో 67 శాతంమంది అవును అని చెప్పారు. పలు ప్రాంతాల్లో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఉన్నాయని..వాటిని పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు.

రెవెన్యూ సేవలకు సంబంధించి మీ పాసుపుస్తకం దరఖాస్తుపై రుసుము కాకుండా ఏవైనా అదనపు ఛార్జీలు తీసుకుంటున్నారా అన్న ప్రశ్నకు అవును అని 24.95 శాతం మంది, మీ అర్జీ గురించి గ్రామ రెవెన్యూ అధికారి విచారణ కొరకు నోటీసు ఇచ్చారా అన్న ప్రశ్నకు ఇచ్చారు అని 40.61 శాతం మంది, మీ అర్జీ గురించి గ్రామ రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారా అన్న ప్రశ్నకు 63.33 శాతం మంది అవును అని సమాధానం ఇచ్చారు. అదే విధంగా మీ సర్వే దరఖాస్తుపై దరఖాస్తు రుసుము కాకుండా అదనపు ఛార్జీలు తీసుకున్నారా అన్న ప్రశ్నకు 22.04 శాతం మంది అవును అని, మీ భూమి సర్వే చేయుటకు మీకు విచారణ తేదీ, సమయం తెలుపుతూ నోటీసు జారీ చేశారా అన్న ప్రశ్నకు అవును అని 59.80 శాతం మంది, మీకు ఇచ్చిన నోటీసు ప్రకారం సర్వేయర్ మీ భూమిని సర్వే చేశారా అన్న ప్రశ్నకు అవును అని 56.51 శాతంమంది సమాధానం ఇచ్చారు. రెవెన్యూ సేవల్లో మార్పు కనిపించాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ విభాగంలో మార్పు చూపిస్తే ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతుందని...ఆ మేరకు అధికారులు పనిచేయాలని సీఎం అన్నారు.

దేవాలయాల్లో దర్శనం, వసతులు, పరిశుభ్రత, వంటి వివిధ అంశాలపై భక్తుల అభిప్రాయాలను కూడా ప్రభుత్వం తెలుసుకుంది. దర్శనం మీరు భావించిన సమయంలో జరిగిందా అన్న ప్రశ్నకు 70 శాతం మంది అవును అని, దేవాలయాల్లో మౌలిక వసుతుల, తాగునీరు, వాష్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలపై 63 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అన్న ప్రశ్నకు 81 శాతం మంది అవును అని సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...దేవాలయాల్లో భక్తుల పట్ల మర్యాదగా, సౌమ్యంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. దేవాలయాల్లో దేవుని సేవకు వాలంటీర్ల విధానాన్ని అమలు చేయాలని....క్యూలైన్ల నిర్వహణతో పాలు పలు సేవల్లో పనిచేసేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని...స్వచ్ఛందంగా వచ్చే వారిని సేవలకు ఉపయోగించుకోవాలని సూచించారు. దేవుని సేవలో పని చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తారు...వారికి సరైన శిక్షణ, అవగాహన కల్పించి దేవాలయ సేవలకు వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా పూజలు, జాతరలు జరుగుతాయని.... వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సీఎం అన్నారు. జాతరలు, ఇతర వేడుకల సందర్భాల్లో అందరికీ వసతి ఇవ్వలేని సమయంలో టెంట్లు ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

రాష్ట్రంలో వర్క్ ఫ్రం హోంను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్క్ ఫ్రం హోంతో పాటు నైబర్ హుడ్ వర్కింగ్, కో వర్కింగ్ విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇంటి నుంచే పని విధానంలో వసతులు, అవకాశాలు కల్పించడం, శిక్షణ అందించడం ద్వారా పెద్ద ఎత్తున అవకాశలు సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వర్క్ ఫ్రం హోంపై సర్వే నిర్వహిస్తున్నారు. 2.68 కోట్ల మందిని సర్వే చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 82.06 లక్షల మందిని సర్వే చేశారు. వీరిలో 1.72 లక్షల మంది వర్క్ ఫ్రం హోం విధానంలో పని చేస్తున్నట్లు వివరించారు. వర్క్ ఫ్రం హోం విధానంలో పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నా.. తమకు తగిన అవకాశాలు లేవని...అటువంటి ఉపాధి కల్పిస్తే తాము కూడా వర్క్ ఫ్రం హోం విధానంలో పనిచేస్తామని 20.43 లక్షల మంది తెలిపారు. సర్వే చేసిన వారిలో ఇంటర్ కంటే తక్కువ చదివిన వారు 9.05 లక్షల మంది ఉండగా, డిప్లొమా, ఆపై చదువులు చదివిన వారు 10.73 లక్షల మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లో వర్క్ ఫ్రం హోం సెంటర్లు, పని స్టేషన్ సెంటర్‌ల ఏర్పాటుకు ఉన్న భవనాలపైనా సర్వే నిర్వహిస్తున్నారు. విద్యార్హతలు ఉండి, పని చేసే సామర్థం ఉన్న వారికి ట్రైనింగ్ ఇవ్వడం ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశాలు కల్పించేందుకు ఆయా సంస్థలతో మాట్లాడాలని సీఎం అధికారులకు సూచించారు. అనంతరం మనమిత్ర ద్వారా అందుతున్న వాట్సాప్ సర్వీసులపైనా సీఎం సమీక్ష చేశారు. ప్రస్తుతం 200 రకాల సేవలు వాట్సాప్ ద్వారా అందుతున్నాయని అధికారులు వివరించారు. డిజిటల్ లిటరసీ ట్రైనింగ్ జరగాలని, అన్ని సేవలు ఆన్లైన్‌లో ఇస్తున్నారనే సమాచారం ప్రజలకు చేరాలని సీఎం అన్నారు. తద్వారా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని, అవినీతిని నివారించవచ్చని సీఎం అన్నారు. డ్రోన్ సేవలను విస్తృతంగా ఉపయోగించుకునే విధానంపైనా అధికారులు దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. పోలీసు విభాగంలో రాత్రి గస్తీ విధుల్లో సిబ్బందిని తగ్గించి డ్రోన్ ద్వారా పర్యవేక్షించే పరిస్థితి రావాలన్నారు. అదే విధంగా పారిశుధ్య పనుల్లో కూడా డ్రోన్ వాడకాన్ని మెరుగుపరచాలని సూచించారు. టెక్నాలజీ సాయంతో ఎఫెక్టివ్‌గా పనిచేసి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నప్పుడు వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సీఎం అన్నారు.

## అసెంబ్లీకి సారొస్తున్నారు

కానున్న తరుణంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీ భేటీ కానుంది. అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అంశాలు.. సర్కార్‌పై సంధించాల్సిన ప్రశ్నలు..అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు కేసీఆర్.. అయితే.. డైరెక్షన్ మాత్రమే కాదు డైరెక్ట్‌గా సభకు వస్తారంటున్నారు బీఆర్ఎస్ నేతలు.జటీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే.. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేసీఆర్ టోన్‌తో పొలిటికల్ సీన్ మారింది. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం సభలో ఉన్న బలంబలగం ప్రకారం ఒక సీటు గెలవచ్చు. రెండో అభ్యర్థిని నిలబెడితే ఎలా వుంటుందనే చర్చను ఫామ్‌హౌస్ మీటింగ్‌తో తెరపైకి తెచ్చారు. తద్వారా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలనే వ్యూహమా? ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఝలక్ ఇచ్చే ఎత్తుగడా? అనే డిస్కషన్స్ నడిచాయి.ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ రెండు సీట్లకు పోటీ చేస్తుందా?..అని పొలిటికల్ డొమైన్‌లో చర్చకు తావు తీసిన కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రావణ్‌కుమార్ అభ్యర్థితత్వాన్ని ఖరారు చేయడం ద్వారా తన మార్క్ చాటుకున్నారనేది నడుస్తోన్న టాక్. మరి ఇంతకీ గులాబీ దళం చెప్పున్నట్టుగా బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరుకావడం ఖాయమేనా? అయితే సభలో ఆయన వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి..? రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు,కులగణన, బీసీ రిజర్వేషన్.. ఎస్సీ వర్గీకరణ బిల్లు, కాళేశ్వరం, ఎస్ఎల్‌బీసీ, రాష్ట్ర అప్పులు.. ఇలా కీలక అంశాలపై సభలో గళమెత్తడం సహా.. ఔర్ ఏక్ దక్కా అనే రేంజ్‌లో మళ్లీ ఉద్యమ పంథాలో విజృంభిస్తారా? అనే చర్చయితే జోరందుకుంది. ఇదంతా బీఆర్ఎస్ఎల్పీ భేటీలో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## ఆఫ్రికా ఐలాండ్ లో లలిత్ మోడీ

ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. చివరికి దేశం విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కొద్దిరోజులుగా ఇంగ్లాండ్లో తల దాచుకున్నాడు. ఇప్పుడు ఏకంగా వనువాటు వెళ్లిపోయాడు. అయితే ఆ దేశం పౌరసత్వం తీసుకోవడానికి లలిత్ ఎంత స్థాయిలో నగదు చెల్లించాడు అనేది బయటికి తెలియ రాలేదు. లలిత్ మోడీ ఐపీఎల్ ను అభివృద్ధి చేసింది నిజమే అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాడని అతనిపై అభియోగాలు ఉన్నాయి. 2010 నుంచి అతడు ఇంగ్లాండ్ లో తల దాచుకుంటున్నాడు. అయితే ఇప్పుడు అతడు వేరే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. దీంతో అతడు భారతదేశానికి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఎందుకంటే అతడు పౌరసత్వం తీసుకున్న దేశంలో ఉన్న నిబంధనలే దానికి కారణమని తెలుస్తోంది.

# చివరి దశకు కశ్మీర్ వ్యవహారం

**కశ్మీర్ వ్యవహారం ఫైనల్ స్టేజ్‌కు చేరుకోబోతుందా..? పరిస్థితులు చూస్తుంటే.. అలాగే కనిపిస్తోంది. త్వరలోనే పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా కశ్మీర్ అంశంలో పాకిస్తాన్‌కు భారత్ బుద్ధి చెప్పే తరుణం ఆసన్నమయ్యింది. పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్ కేంద్రంగా భారత్‌ను ఇబ్బందిపెట్టడానికి అంతర్జాతీయ వేదికలను పాకిస్తాన్ ఎక్కువగా ఉపయోగిస్తోంది.**




కశ్మీర్ అంశాన్ని శాంతి చర్చలతో పరిష్కారించాలని పాక్ ప్రధాని ఇటీవల భారత్‌కు పిలుపునిచ్చారు. ఈ తరుణంలో.. అసలు భారత్ ఏమనుకుంటుందో అనే సందేహం పాక్ మెదణ్ని తొలిచేస్తున్నట్లుంది.తాజాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ లండన్‌లో ఓ కార్యక్రమానికి అటెండ్ అవ్వగా.. అక్కడ ఒక పాకిస్తాన్ జర్నలిస్టు.. మంత్రి జైశంకర్‌ని ఉద్దేశించి ప్రశ్న అడిగారు. అయితే, ఈ ప్రశ్నలో పాక్ జర్నలిస్ట్ విచిత్రమైన వాదన చేశారు. కశ్మీర్‌ను భారత్ చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తుందని అన్నారు. అందుకే, కశ్మీరీలు భారత్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక, "కశ్మీర్‌పై శాంతి ఒప్పందం కోసం అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సహాయం తీసుకుంటారా..? ప్రధాని మోడీ.. ట్రంప్‌కు మంచి స్నేహితుడే కాబట్టి, ఆ దిశాగా ఏదైనా ప్రయత్నాలు జరగొచ్చా..?" అంటూ పాకిస్తాన్ టోన్‌లో సదరు జర్నలిస్ట్ ఆసక్తికర ప్రశ్నను లేవనెత్తారు. అయితే, జర్నలిస్ట్ ఉద్దేశం అర్థమైన మంత్రి జైశంకర్ అంతే స్పష్టంగా ఆన్సర్ ఇచ్చారు.

లండన్‌కు చెందిన థింక్ ట్యాంక్ 'చాథమ్ హౌస్'లో జరిగిన ఈ కార్యక్రమంలో.. కశ్మీర్ సమస్యకు పరిష్కారం ఏంటనే అంశంలో మంత్రి జైశంకర్ 'టిట్ ఫర్ ట్యాట్'లా సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ కాశ్మీర్ విషయంలో చాలా మంచి పనులే చేసిందని అన్నారు. అలాగే, కశ్మీర్‌లో ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అందులో మొదటి అడుగు ఆర్టికల్ 370ని తొలగించడమనీ.. కాశ్మీర్‌లో వృద్ధి, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించడం రెండవ అడుగనీ.. భారీగా పెరిగిన ఓటింగ్‌తో ఇటీవల ఎన్నికలు నిర్వహించడం మూడవ అడుగని అన్నారు.ఇక, చట్టవిరుద్ధంగా పాకిస్తాన్ ఆక్రమించిన 'కాశ్మీర్‌లోని దొంగిలించిన భాగాన్ని' భారతదేశానికి తిరిగి ఇచ్చిన తర్వాత కాశ్మీర్ సమస్య "పరిష్కరించబడినట్లే" అని జైశంకర్ స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకోవడం మాత్రమే కశ్మీర్ అంశంలో పరిష్కరించాల్సిన ఏకైక సమస్య అని భారత్ పలు సందర్భాల్లో చెప్పింది.జమ్మూ కాశ్మీర్‌లోని దాదాపు 78 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకుందన్న మాటను పదే పదే చెబుతోంది. 1994 పార్లమెంటు తీర్మానం కూడా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో భారత్ వైఖరి స్పష్టంగా తెలియజేశారు. "జమ్మూ కశ్మీర్, లడఖ్‌కు సంబంధించినంత వరకూ మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగంగా ఉండేవి, ఉన్నాయి, ఉంటాయి అని" పేర్కొన్నారు. అలాగే, "పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న అన్ని ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని" ఈ తీర్మానం పిలుపునిచ్చింది.మంత్రి జైశంకర్ లండన్‌లో తాజాగా చేసిన వ్యాఖ్యలకు పాకిస్తాన్ నుండి తీవ్రమైన స్పందన వచ్చింది. పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. "మార్చి 5న భారత విదేశాంగ మంత్రి జమ్మూ కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలను పాకిస్తాన్ తిరస్కరిస్తుందని అన్నారు.

> **"పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న అన్ని ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని" ఈ తీర్మానం పిలుపునిచ్చింది.మంత్రి జైశంకర్ లండన్‌లో తాజాగా చేసిన వ్యాఖ్యలకు పాకిస్తాన్ నుండి తీవ్రమైన స్పందన వచ్చింది. పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. "మార్చి 5న భారత విదేశాంగ మంత్రి జమ్మూ కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలను పాకిస్తాన్ తిరస్కరిస్తుందని అన్నారు.**

భారతదేశం గత 77 సంవత్సరాలుగా జమ్మూ కాశ్మీర్‌ను ఆక్రమిస్తుందనీ.. భారత్ ఆక్రమించిన ఆ ప్రాంతంలోని పెద్ద భూభాగాలను ఖాళీ చేయాలని" డిమాండ్ చేశారు.కట్ చేస్తే ఫ్లాష్ బ్యాక్‌లో ఇటీవల.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దీనికి విరుద్ధంగా శాంతి మంత్రం వల్లించారు. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి ప్రారంభంలో.. "కాశ్మీర్ సంఘీభావ దినోత్సవం" సందర్భంగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.కశ్మీర్ యావత్తూ భారత భూభాగమని మంత్రి జైశంకర్ చెప్పడం కొత్తేమీ కాదు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారతదేశంలో భాగమని... ప్రతి భారతీయ రాజకీయ పార్టీ POK భారతదేశానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఆ మధ్య, న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన సంభాషణలో కూడా జైశంకర్ దీన్ని స్పష్టం చేశారు..పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూ కశ్మీర్ భాగాన్ని తిరిగి తీసుకుంటామంటే.. దాన్ని ఎవరు ఆపుతున్నారు? దాన్ని తిరిగి తీసుకోవద్దని కశ్మీర్ ప్రజలు ఎప్పుడైనా చెప్పారా?" అని ముఖ్యమంత్రి రాష్ట్ర అసెంబ్లీలో వెల్లడించారు. కార్గిల్ యుద్ధంలో కూడా భారతదేశానికి పీఓకెను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం వచ్చిందనీ..కానీ, అలా చేయడంలో భారత్ ఎందుకు విఫలమైందని అబ్దుల్లా అడిగారు. ఇక, కేంద్రం పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకునే క్రమంలోనే.. ప్రస్తుతం చైనా నియంత్రణలో ఉన్న జమ్మూకశ్మీర్ భాగాన్ని కూడా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఒమర్ అబ్దుల్లా కోరారు.

ఇటీవల చైనాతో భారతదేశ సంబంధం కాస్త మెరుగుపడుతుందని మంత్రి జైశంకర్ వెల్లడించారు. చైనా గురించి, మాట్లాడుతూ... టిబెట్‌లో కైలాస పర్వత తీర్థయాత్ర మార్గం ప్రారంభంతో సహా అక్టోబర్ 2024 నుండి జరిగిన కొన్ని పరిణామాలు చైనాభారత్ సంబంధాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. "ప్రపంచంలో రెండు బిలియన్లకు పైగా జనాభా కలిగిన ఏకైక దేశాలుగా చైనాతో మాకు చాలా, చాలా ప్రత్యేకమైన సంబంధం ఉందనీ.. రెండు దేశాల ఆసక్తులను గౌరవించే, సున్నితత్వాలను గుర్తించే, ఇద్దరికీ ఉపయోగకరంగా ఉండే సంబంధాన్ని భారత్ కోరుకుంటుంది" అని అన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్‌కు సరిహద్దు దేశాల వ్యవహారంలో ప్రతికూల పరిస్థితులే ఎదురయ్యాయి. మాల్దీవుల నుండి నేపాల్ వరకూ ఒక రకమైన సమస్య ఉంటే... శ్రీలంక, బంగ్లాదేశ్‌ల నుండీ మరో రకమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక, పాకిస్తాన్, చైనాలు సందు దొరికితే భారత్ భూభాగాన్ని ఆక్రమించుకోడానికి సరంజామాలు రెడీ చేసుకుంటూనే ఉన్నాయి. ఆర్థికంగా భారత్ పరుగులు పెడుతుంటే... రక్షణ రంగంలో అభివృద్ధి సాధిస్తుంటే... ఇంకోవైపు నుండీ... చైనా సహాయంతో పాకిస్తాన్ రెచ్చిపోతూనే ఉంది. చైనా నుండి భారీగా ఆయుధాలు కొనుగోలు చేస్తూ భారత్‌నే ఛాలెంజ్ చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ మాటలు చెప్పడాన్ని దాటి ఏదైనా చేయాలనే కామెంట్లు ఎప్పటి నుండో వినిపిస్తున్నాయి. మరి, భారత్ దీనికి పరిష్కారం ఎలా సాధిస్తుందో చూడాలి.

# ఇక రాహుల్ మార్క్ కాంగ్రెస్



**జయభేరి, హైదరాబాద్, మార్చి 10:**

కాంగ్రెస్ పార్టీ అంటే అంతర్గత ప్రజాస్వామ్యానికి పెట్టింది పేరు.నాయకులు ఎవరికి వారు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటారు. స్వేచ్ఛ ఉంది కదా అని తమకు అనుగుణంగా మలుచుకుంటూ పార్టీ లైన్ దాటుతుండే వారు. ఈ స్వేచ్ఛతో పార్టీ కి వచ్చే తిప్పలు అన్ని ఇన్ని కావు.. ఆ క్రమంలో ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి మంచిని మైక్ లో చెప్పండి. మహా సముద్రం లాంటి పార్టీ.. ఏ రాజకీయ పార్టీలో లేని స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీ లో ఉంటుంది. సొంత పార్టీ నేతల్నే స్థాయీ బేధం లేకుండా టార్గెట్ చేస్తుంటారు నాయకులు.. మరే పార్టీలో అలా ఉండదు..తమ పార్టీలో ఉన్న అంతర్గత ప్రజాస్వామ్యం గురించి ఆ పార్టీ నాయకులు కూడా గొప్పగా చెప్పుకుంటారు. అయితే నాయకులకు అంత స్వేచ్ఛ వల్ల అనేకసార్లు మిస్ ఫైర్ అయిన సందర్భాలు ఉన్నాయి. అందుకే ఆ పరిస్థితికి బ్రేక్ వేసేందుకు రెడీ అయ్యారంట తెలంగాణ నూతన ఏఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్. అందులో భాగంగా రాగానే తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ వేటుతో తన మార్క్ చూపించారనే చర్చ జరుగుతోంది. మార్క్ చూపించడమే కాదు అది కంటిన్యూ అవుతుందనే సంకేతాలు కూడా ఇస్తున్నారంట.పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడినా, పార్టీ ఇంటర్నల్ విషయాలు బయట మాట్లాడినా చర్యలు తప్పవనే ఇండికేషన్ ఇవ్వకనే ఇచ్చారు నటరాజన్..పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని కులగణన సర్వే చేసింది. ఈ సర్వేని ఉద్దేశించి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తప్పుపడుతూ.. తన సొంత యూట్యూబ్ ఛానల్‌లో ఆ సర్వే నివేదికను తగల పెడుతూ అసభ్యకరంగా మాట్లాడారు. దాంతో ఆయనకు పార్టీ షోకాజ్ నోటీసు లు ఇచ్చింది. దానికి మల్లన్న వివరణ ఇవ్వలేదు. దాంతో పార్టీ చాలా రోజులు తీన్మార్ మల్లన్న పై వేటు వేయడానికి ఆలోచించింది. అయితే మీనాక్షి నటరాజన్ వచ్చిన వెంటనే ఈ ఇష్యూపై రియాక్ట్ అయి.. తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తూ ఇష్టానుసారం వ్యవహరించే నేతలు ఒక్కసారిగా అలర్ట్ అవుతున్నారంట.మరోవైపు పార్టీ సీనియర్ నేత వీహెచ్ సైతం తన నివాసం లో రాజకీయ పార్టీ లకు అతీతంగా మున్నూరు కాపు సామజికవర్గానికి చెందిన నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో అఖిలపక్ష కమిటీ వేయడంతో పాటు మున్నూరు కాపులకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యత తగ్గిందని కామెంట్లు చేశారు. అలాగే కులగణనపై మీటింగులో పాల్గొన్న ప్రతిపక్ష నేతలు నెగిటివ్‌గా మాట్లాడారు. తమ బలం చూపించుకోడానికి పార్టీ కతీతంగా ఒక సభ పెట్టాలనే నిర్ణయం తీసుకున్నారుబీఆర్ఎస్, బీజేపీ మున్నూరు కాపు నేతలు కూడా పాల్గొన్న ఈ మీటింగులో ఆ వర్గానికి మంత్రి వర్గంలో చోటు దక్కక పోవడంపై విమర్శలు గుప్పించారు. కులగణనలో మున్నూరు కాపుల జనాభా సంఖ్యను తక్కువగా పేర్కొన్నారని ఎత్తి చూపించారు. ఆ మీటింగ్ వ్యవహారం తెలుసుకున్న మీనాక్షి నటరాజన్ వీహెచ్‌తో పాటు అందులో పాల్గొన్న కాంగ్రెస్ నేతలపై సీరియస్ అయ్యారంట. పార్టీలో సీనియర్ నాయకులు అలా ఇంట్లో అన్ని పార్టీ ల నేతలతో సమావేశమై.. కులగణలపై , కాంగ్రెస్ పార్టీ లో మున్నూరు కాపులకు ప్రాధాన్యత గురించి చర్చించడం ఏంటని సీరియస్ అయ్యారంట. దానికి సంబంధించి వి.హనుమంతరావుని గాంధీ భవన్ కి పిలిపించి మందలించారన్న టాక్ వినిపిస్తోంది.అదలా ఉంటే సీఎం రేవంత్ రెడ్డి సైతం మంచి మైక్‌లో చెప్పాలని.. చెడు చెవిలో చెప్పాలని విస్తృత స్థాయి సమావేశంలో పేర్కొన్నారు. బహిరంగంగా పార్టీ లైన్ మాట్లాడితే సహించేది లేదని ఆయన ఇచ్చిన ఆ ఇండికేషన్ హాట్ టాపిక్‌గా మారింది. సీఎం అలా చెప్పడం.. మీనాక్షి నటరాజన్ పార్టీ లైన్ దాట్టొద్దు అని, ఎవరి పని వారు చేయాలని క్లియర్‌గా స్పష్టం చేయడం. దానికి తగ్గట్లే రాగానే తీన్మార్ మల్లన్నపై వేటు పడటంతో కాంగ్రెస్ నేతలు అలర్ట్ అవుతున్నారంట. సీనియర్ నాయకుడు వీహెచ్ మీటింగ్ పై ఆమె సీరియస్ అవ్వడంతో.. ఇక ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే పార్టీలో తమ పప్పులు ఉడకవని నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ఏది ఏమైనా తెలంగాణ కాంగ్రెస్‌కి మంచి రోజులు వచ్చాయని, అందరికీ క్రమశిక్షణ అలవడుతుందని సీనియర్లు ఆనందపడిపోతున్నారు.

# ఫర్టిలైజర్ షాప్ లో నకిలీ విత్తనాలు

- మూడు పువ్వులు ఆరు కాయలుగా నకిలీ విత్తనాల వ్యాపారం
- ఆరుగాలం పండించాల్సింది పోయి మోసపోతున్న రైతులు

**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రోజు రోజుకూ నకిలీ విత్తనాలు దందా యద్దేచ్చాగా సాగుతోంది. అడ్డదారిలో లక్షల ఆదాయం సంపాదించాలనే కొంత మంది నకిలీ విత్తన వ్యాపారుల స్వార్ధ చింతన ఈ విత్తన సరఫరా దందాను పెంచి పోషిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ విత్తనాలను తక్కువ ధరకు విత్తనాలు తీసుకొచ్చి లక్షల రూపాయల ఆదాయం దండుకుంటున్న తీరు వ్యాపారుల ధన దాహానికి దర్పణం పడుతుంది నకిలీ విత్తనాల వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా విరజిల్లుతుంది. జగదేవపూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన రైతు దయ్యాల లచ్చయ్య(35) తను కౌలు తీసుకున్న రెండు ఎకరాలలో పుచ్చకాయ విత్తనాలను సాగుబడి చేశాడు. నకిలీ విత్తనాల కారణంగా కాయలు ఎదగా ఎదగకపోవడం, ఎదిగిన కొద్ది కాయల్లో గుజ్జు లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో రైతులు మాట్లాడుతూ గజ్వేల్ లోని ఓ పర్టీలైజర్



షాపులో కొన్నానని, విత్తనాలు నాటి ఇప్పటికి మూడు నెలల పైన గడుస్తున్నా సరైన కాపు రాకకోవడంతో నకిలీ విత్తనాలను నాటినామని ఇప్పుడు గ్రహించమని తెలిపారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని ఇప్పుడు దిగుబడి రాక లక్షల్లో అప్పులయ్యామని వాటిని ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు విత్తనాల దుకాణ దారుణ్ణి అడగగా సరైన సమాధానం లేదని అలాగే అధికారులు కూడా పట్టించుకోవడంలేదని ఇలా ఉంటే తనకు చావే శరణ్యమని వాపోయారు. నకిలీ విత్తనాలను అమ్మిన ప్రముఖ విత్తనాల షాప్ నిర్వాహకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బబ్బురి శ్రీనివాస్ గౌడ్, దగ్గు నర్సయ్య, వెంకట్రావు పేట్ అయ్యాలం, దయ్యాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# రెండవ మహాసభను విజయవంతం చేయండి

- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్

**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి , కార్యదర్శి ప్రవీణ్ కుమార్ లు పిలుపునిచ్చారు. నేడు శంకర్ పల్లి మండల పరిధిలోని పొద్దటూరు శివారులోని ప్రగతి రిసార్ట్స్ లో నిర్వహిస్తున్న జిల్లా రెండవ మహాసభకు మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కె శ్రీనివాస్ రెడ్డి, మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మాజీద్, సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ కార్యదర్శి రాం నారాయణ లతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని వారు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులు అందరూ మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలో 25 సంవత్సరాలకు పైగా విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఈ మహాసభల సందర్భంగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి జర్నలిస్టులు హాజరు కావాలని వారు కోరారు.

# గంజాయి పై పోలీసుల నిఘా

- డాగ్ స్క్వాట్ తో పోలీసుల తనిఖీలు



**జయభేరి, వర్గల్, మార్చ్ 10 :**

మండల పరిధిలోని వేలూరు నాచారం గుట్ట దగ్గర ఉన్న టీస్టాల్స్, హోటల్స్, పాన్ డబ్బాలు, వైన్స్ లు, రోడ్డు వెంబడి చిరు వ్యాపారుల దుకాణాల వద్ద సోమవారం సాయంత్రం డాగ్ స్కాట్ తో ఎస్సై బి కరుణాకర్ రెడ్డి. ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాలను యువత ఎక్కడైనా వాడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. గంజాయి. డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ పోచగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ అనధికార అక్రమ నిర్మాణాలు.. అధికారులపై పిర్యాదు...

- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్నటువంటి అక్రమ నిర్మాణాలు, అక్రమ సెల్లార్లు, భారీ అనధికార షెడ్ల నిర్మాణాలు
- సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పౌరులు అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న అధికారులపై..
- రాజకీయ నాయకుల ఫ్లెక్సిలలో పోజులిస్తున్న,అర్హత లేని వార్డ్ ఆఫీసర్ లను కొనసిగిస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్ పై. టౌన్ ప్లానింగ్ అధికారులపై పిర్యాదు.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో రాజకీయ నాయకుల మెప్పు కోసం పనిచేస్తున్న కమిషనర్ పై ఫిర్యాదు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, సెల్లార్లు, భారీ షెడ్డుల నిర్మాణాలపై ఆధారాలతో సహా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ దొడ్డిదారున అనుమతులు ఇచ్చి లక్షలాది రూపాయల ముడుపులు తీసుకుంటూ ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయాన్ని అదే విధంగా మున్సిపాల్టీ చట్టాలకు లోబడి పట్టణ ప్రణాళిక అభివృద్ధి ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులే ఈ విధంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించాలని మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించిన కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్క రోజు కూడా ఉద్యోగంలో ఉండడానికి అర్హులు కారని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. వంద గజాలలోపు ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్న చిన్న మధ్యతరగతి ప్రజల దగ్గరికి వెళ్లి అనుతిలేదు సెట్ బ్యాక్ లేదు అని అన్ని రూల్స్ మాట్లాడే టౌన్ ప్లానింగ్ అధికారి అదే డబ్బున్న బడ బాబులు మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించి నిబంధనలు తుంగలో తొక్కి బహుళ అంతస్తుల నిర్మాణాలు భారీ సెల్లార్లు భారీ షెడ్డుల నిర్మాణాలు చేస్తుంటే కమిషన్లకు కక్కుర్తి పడి నిర్లక్ష్యంగా వివరిస్తున్నటువంటి కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. కలెక్టర్ కూడా ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్నటువంటి అవకతవకలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్ సంబంధిత అధికారులపై అతి త్వరలో విచారణ చేసి బాధ్యతరాహిత్యంగా వ్యవహరించినటువంటి కమిషనర్ అధికారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.

# కాంగ్రెస్ పార్టీ తోనే.. సామాజిక న్యాయం సాధ్యం

- పేద విద్యార్థులకు నాణ్యమైన గురుకుల విద్య
- గజ్వేల్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరి
- డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి

**జయభేరి, గజ్వేల్, మార్కుక్ మర్చి 10:**



కాంగ్రెస్ పార్టీలో మాత్రమే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పిడిచెడ్ లో సిసి రోడ్డు నిర్మాణం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాలతో కుల గణన చేపట్టి బీసీలకు సముచిత న్యాయం కల్పిస్తుండగా, ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు నిలిచిన వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశం దక్కుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత దక్కుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తూ నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, పక్కా భవన నిర్మాణాల కోసం రూ 11 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు స్పష్టం చేశారు. అలాగే గజ్వేల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన మేర నిధులు మంజూరీ చేస్తుండగా, సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ 5 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుండగా, రూ 5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణాలు ప్రారంభించగా, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు అజహర్, లక్షమారెడ్డి, సుఖేందర్ రెడ్డి, ఊడెం శ్రీనివాస్ రెడ్డి, అక్కరం యాదగిరి, కర్ణకార్ రెడ్డి అమెరిందర్ రెడ్డి, దప్పు గణేష్, అజ్జర్ మాజీ సర్పంచ్ రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య కాలేజీలపై ఐటి సోదాలు

**జయభేరి, హైదరాబాద్:**

ప్రముఖ కార్పోరేట్ కళాశాల గ్రూప్ శ్రీ చైతన్య కాలేజీలపై దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను అధికారులు సోదాలకు దిగారు. ఆంధ్ర తెలంగాణ తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నైలో సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయి. పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు, విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులు తీసుకొని టాక్స్ చెల్లించకుండా ఎగవేసినట్లు గుర్తించారు. విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా సాఫ్ట్వేర్ తయారు చేసుకొని లావాదేవీలు జరిపారు. ప్రభుత్వానికి కట్టే టాక్స్ కొరకు మరొక సాఫ్ట్వేర్ ఏర్పాటు చేసుకుంది శ్రీ చైతన్య యాజమాన్యం. మాదాపూర్ లోని శ్రీ చైతన్య కాలేజ్ హెడ్ క్వార్టర్స్ లో సోదాలు జరుగుతున్నాయి.




# తూంకుంట లోని పలు వార్డుల్లో పర్యటించిన ప్రత్యేకాధికారి సంధ్య

- వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన

**జయభేరి, మర్చి :**

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రత్యేకాధికారి బి, సంధ్య పర్యటించారు. అనంతరం అక్కడ పలు సమస్యలపై ఆరా తీశారు. ఇక పన్ను వసూలు చేయడంపై అధికారులకు పలు సూచనలు అందచేశారు. అదేవిధంగా రానున్న వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం హకింపేటలోని సిఐఎస్ఎఫ్ క్యాంపస్ లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డిఆర్ సీ సెంటర్, తూంకుంట లోని బయో మైనింగ్ సైట్ ను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, డిప్యూటీ ఈఈ జి. సునీత, ఆర్ ఓ అర్షద్ అహ్మద్, ఆర్.ఐ లు పి. భాస్కర్, ఆర్. రేణుక, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నవవధువు వివాహానికి పుస్తే మట్టెలు అందజేతా

- కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్



**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో సోమవారం కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతుల ఆధ్వర్యంలో నవ వధువు వివాహానికి పూస్తే మట్టెలు, చీర సారే అందజేశారు ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సేవ చేయడంలో తృప్తి ఉంటుందని అందులో భాగంగా రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన నవ వధువు వివాహానికి పూస్తే మట్టెలు అందజేయడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ టోట శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి



**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటుకు మాజీ సీఎం కెసిఆర్ కృషి చేశారని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆదిత్య పిల్లల ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ పట్టణంలో జిల్లా ఆసుపత్రిని మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని కోట్ల రూపాయలతో నిర్మించారని ఇలాంటి వైద్య సేవలైన ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. నియోజవర్గం అభివృద్ధి చెందడంతో పట్టణంలో వ్యాపార సంస్థలతో పాటు విద్యా వైద్య సౌకర్యాలు పెద్ద ఎత్తున అందుబాటులో రావడానికి ప్రైవేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయని అత్యవసర పరిస్థితుల్లో చిన్నపిల్లలను నిలోఫర్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించే పరిస్థితుల్లో ఆదిత్య పిల్లల ఆసుపత్రిని పట్టణంలో నెలకొల్పడం పట్ల ఆయన డాక్టర్ ప్రదీప్ తేజను అభినందించారు.

# కాంగ్రేస్ నేతల చిత్రపటానికి పాలాభిషేకం

- సోదా రామకృష్ణ, కాంగ్రేస్ సమన్వయ కమిటీ సభ్యులు



**జయభేరి, పరకాల, మార్చి 10:**

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు పరకాల పట్టణంలో 200 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కి కృతజ్ఞతగా పరకాల పట్టణంలో వారి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటుగా పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పట్టణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని జర్నలిస్టులో అందుకోసం పనిచేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి యూనియన్ డైరీ క్యాలెండర్ అందజేశారు జర్నలిస్టుల పక్షాన ఉండి హక్కుల కోసం మాట్లాడాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ మెరుగైన సమాజం కోసం జర్నలిస్టుల సేవలు మరువలేనివని యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా జర్నలిస్టుల రచనలు అవసరమన్నారు.

జబ్బును నయం చేసే డాక్టర్ ఎలానో జబ్బు పడ్డ సమాజానికి జర్నలిస్టు అంతే అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో జర్నలిస్టు సంక్షేమం కోసం 100 కోట్ల నిధి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు హెల్త్ కార్డులు అక్రిడేషన్ ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయం గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు జర్నలిస్టులకు కెసిఆర్ చేసినన్ని సేవలు మరెవరు చేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 నెలలకే సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చేతులెత్తేసిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను అటుకెక్కించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుందని కెసిఆర్ ప్రభుత్వం గెలిస్తే తప్ప ప్రజా సంక్షేమ పథకాలు ముందుకు పోవని అన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





## సుధా రెడ్డికి అవార్డు ప్రదానం

**జయభేరి, హైదరాబాద్ :**

మహిళా దినోత్సవం నీ పురస్కరించుకొని తెలంగాణ సారస్వాత పరిషత్ లో వరల్డ్ కన్స్యూమర్ రైట్స్, ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాత్రి రత్న సేవ పురస్కర్ అవార్డు, కన్స్యూమర్ ఎదురకొంటున్న సమస్యల పైన పోరాటం చేసినందుకు మేడ్చల్ WCR చైర్మన్ ముక్కెర్ల సుధా రెడ్డిని ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేసారు. వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ వ్యవస్థాపక నేషనల్ చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవటం, ఇంకా బాధ్యతను పెంచిందని సుధారెడ్డి మీడియాకి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా WCR టీం, తదితరులు పాల్గొంన్నారు.

## పట్ట పగలే మహిళా దారుణ హత్య




**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

రిమ్మనగూడ పెట్రోల్ బంక్ వద్ద ఆస్ర అనే ముస్లిం మహిళను పారతో కొట్టి చంపి పరారైన దుండగుడు, అడ్డుకోబోయిన భర్తపై దాడి చేశాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ పెట్రోల్ బంక్ వద్ద ఆంధ్రప్రదేశ్ కి చెందిన అశ్ర (45) అనే వివాహితపై మహారాష్ట్రకు చెందిన అస్రం(48) దుండగుడు తెల్లవారుజామున 6 గంటలకు పారతో గాయపరిచి హత్యచేసి పరారైనాడు. భార్య అరుపులకు విని వచ్చి అడ్డుకోబోయిన భర్త సదాత్ (50)పై కూడా దాడిచేసి గాయపరిచాడు దుండగుడు. అయితే ఈ దంపతులు ఇది వరకు హైదారాబాద్ లో జీవనాధారం కోసం వచ్చి నివాసమున్నప్పుడు హత్య చేసిన అస్రం తో సదాత్ కుటుంబానికి పరిచయం ఉండేది. కాగా గత కొంత కాలంగా రిమ్మనగూడ పెట్రోల్ బంక్ లో వాచ్ మెన్ గా పని చేస్తూ ఓ రూంలో భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నారు.అయితే నిన్న రాత్రి రిమ్మనగూడలోని వీరి నివాసానికి వచ్చిన దుండగుడు అస్రం, రాత్రి వేళ వీరితోనే బసచేసి తెల్లవారు జామున 6 గంటల సమయంలో అశ్రను పారతో హత్య చేసి, అడ్డుకోబోయిన నన్ను గాయపరిచి పరారైనట్లుగా తెలిపాడు. ఈ విషయమై సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగని ఐలయ్య

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిసిసి అధ్యక్షులు



**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవ్పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ జగదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగని ఐలయ్య సోమవారం నాడు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చూసి అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం జంగాని ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి కాంగ్రెస్ తాను పార్టీలో చేరుతున్నారని అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- MLHP డాక్టర్ సృజన



**జయభేరి, కోదాడ :**

మండలంలోని గోల్ తండాలో క్షయ వ్యాధి శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సృజన ప్రజలకు క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ..ఎడతెరపి లేని దగ్గు, జ్వరం, ఆయాసం, ఆకలి మందగించటం, బరువు కోల్పోవడం, ఛాతీలో మంట వీటిలో ఒకటి, రెండు లక్షణాలు ఉన్నట్టయితే టిబి కేసులుగా అనుమానించి పరీక్షలో చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడి పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే సంవత్సరంలో 15 నుండి 20 మందికి టిబి వ్యాధి అంటుకునే అవకాశం ఉందన్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారు, 60 సంవత్సరాల పైబడిన వారు, స్ట్రీట్ వెండర్స్, గతంలో టిబి మందులు వాడిన వారు, ఫ్యాక్టరీలో పనిచేవారిని గుర్తించి పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రారంభ దశలో క్షయ వ్యాధిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందిస్తారని, ఆరు నెలలు పాటు మందులు వాడితే టిబి జబ్బు పూర్తిగా నయం అవుతుందన్నారు. ~~శిబిరంలో 118 మందికి X ray, తెమడ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం~~ లో వైద్య సిబ్బంది సుభాషిణి, సైదులు, ఉపేందర్, సూపర్ వైజర్ ఉమా మహేశ్వరి, స్వాతి,పరమేశ్వరి, DRTB కోఆర్డినేటర్ ప్రసాద్ STS కిరణ్ కుమార్, మాధవ రెడ్డి, LT రవి, ఆరోగ్య కార్యకర్తలు కళ్యాణి, పద్మావతి, కరుణ కుమారి, మీనా కుమారి, నాగేంద్రమ్మ ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రి భాయ్ పూలే వేడుకలు

- సావిత్రి బాయి పూలే ఆశయాలను కొనసాగించాలి

**జయభేరి, పరకాల, మార్చి 10:**




నేటి తరం యువత, విద్యార్థులు సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోనీ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా వారు ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ స్త్రీల విద్యాభివృద్ధి కోసం వారి హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిని అని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయులుగా సేవలందించి మహిళలు చదువుకవాలని వారి హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయురాలు అని కొనియాడారు. ఎన్ని అవమానాలకు గురైన ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూ మహిళల విద్యాభివృద్ధి కోసం పోరాటం చేసిన తొలి తరం మహిళ ఉద్యమకారుని, ఉపాధ్యాయురాలు అని అన్నారు.

నేటితరం యువత విద్యార్థులు సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల కోసం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్ మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, సాయి కిరణ్ పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్ పట్టణ కార్యదర్శి కొగిల సాయి తేజ లిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్స్ కరుణాకర్ నాగరాజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే.. వెనుకబడిన వర్గాల కు సముచిత న్యాయం

- ముదిరాజుల గొంతు నొక్కుతున్న సీఎం రేవంత్ రెడ్డి సర్కార్
- హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్

**జయభేరి, గజ్వేల్, మర్చి 10:**

కామారెడ్డి బిసి డిక్లరేషన్ తో కాంగ్రెస్ మభ్యపెడుతుండగా, ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, అయితే రాష్ట్రంలో ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలోనే వెనుకబడిన వర్గాలకు సముచిత న్యాయం దక్కుతుందని హైకోర్టు న్యాయవాది, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ హక్కుల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఉద్యమిస్తుండగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మెరుగైన వాటా దక్కేవరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కెసిఆర్ చేపట్టిన సర్వేలో 52 శాతం బీసీలు ఉండగా, మరి సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన కులగణనలో 46 శాతానికి తగ్గిపోవడంలో అంతర్యం ఏమిటని నిలదీశారు. అంతేకాకుండా రాష్ట్ర జనాభాలో 26 లక్షల ముదిరాజ్ కులస్తులు ఉండగా, వారికి అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందని తెలిపారు నామినేటెడ్ పోస్టులతో పాటు ఎమ్మెల్సీలు, మంత్రి పదవులు, ఎమ్మెల్యేల్లో అవకాశం అంతంత మాత్రమేనని నిలదీశారు. అంతేకాకుండా చిరకాల వాంఛ ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డీ నుండి బిసి ఏ మార్పుకు సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్టంలో బీసీలు చైతన్యవంతులై బీసీ నినాదాన్ని ఉధృతం చేయడం, బీసీలకు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత గొంతు కలపడంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిగిరాక తప్పదని హెచ్చరించారు. అంతే కాకుండా ముదిరాజులకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులపై హక్కులు కల్పిస్తూ చర్యలు తీసుకున్న ఘనత బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ కే దక్కుతుందని వివరించారు.

# భారీ మెజారిటీతో విజయాన్ని హర్షం వ్యక్తం చేస్తూ.. మార్పుని స్వాగతిస్తూ..

**జయభేరి, నాగారం :**



నాగారం, శిల్పానగర్ లో గల "పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంట్" లో 9th మార్చ్ 2025 న జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో "పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్" పార్టీవారు అత్యధిక మెజారిటీతో "పారామౌంట్ డెవలప్మెంట్ కమిటీ" పార్టీ వారి పై దిగ్విజయంగా గెలుపొందారు.

పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంట్ లో గల 208 ఫ్లాట్స్ యజమానులలో ఐదుగురు "ఎలక్షన్ ఆఫీసర్స్" ఎనిమిది మంది "అడ్వైజరి కమిటీ" ఏర్పడి, శాంతియుతమైన ఎన్నికలు జరుపుకొనుటకై నిశ్చయించుకున్నారు. సదరు 208 ఫ్లాట్లకు 158 ఫ్లాట్ల యజమాన్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియకు సిక్రెట్ బ్యాలెట్ మాధ్యము ద్వారా ప్రత్యక్షమైన ఓటింగ్, దేశవిదేశాలలో ఉన్న యజమాన్లు అందరూ సులువుగా ఓటింగులో పాల్గొనుటకు "ఇ ఓటింగ్" పద్ధతిని ఒక మొబైల్ లింక్ ద్వారా పోలింగ్ విధానాన్ని ఏర్పాటు చేసుకోవడం విశేషం.

ఈ ఎన్నికలలో పోల్ అయిన 158 ఓట్లకు, గుడివాడ త్రినాథరావు కార్యదర్శి, వారి పార్టీ ప్రతినిధులు అయిన కొట్టె మనోహర్ అధ్యక్షుడు, హరి సాయి కృష్ణ కోశాధికారి, వి. జయ చంద్ర జాయింట్ సెక్రటరీ, వరలక్ష్మి రెడ్డి కార్యనిర్వాహక సభ్యురాలు, మోసూరు శ్రీనివాసరావు కార్యనిర్వాహక సభ్యుడు, ఎనగంధుల ప్రసాద్ కార్యనిర్వాహక సభ్యుడు, శ్రీనాథ్ కశ్యప్ కార్యనిర్వాహక సభ్యుడు, ఓట్ల లెక్కింపు అధికారి సోమ కిరణ్ "పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్" పార్టీకి 107 ఓట్లతో దిగ్విజయం పొంది విజేతగా ఉన్నారు అలాగే "పారామౌంట్ డెవలప్మెంట్ కమిటీ" వారు 51 ఓట్లతో రన్నర్ గా నిలిచారు. "పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్" పార్టీ వారికి సంక్రమించిన 107 ఓట్లలో 26 ఓట్లు "ఇ ఓటింగ్" పద్ధతిలో దేశవిదేశలలో గల యజమాన్ల ఓట్లు కావడం గమనార్హం. ఈ భారీ మెజారిటీతో కూడిన విజయాన్ని పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంటు వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, మార్పుని స్వాగతిస్తూ టపాసులతో వారి ఆనందాన్ని వ్యక్తం చేసారు.



## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**జయభేరి, కోదాడ :**




భారతదేశం సర్వ మతాల సమ్మేళనం, మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఉత్తమ్ పద్మావతి రెడ్డి నియోజకవర్గ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు తోగటి యాదాద్రి అన్నారు. అనంతగిరి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో ముస్లిం సోదరులకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశానికి ఒక విశిష్టత ఉందని, అన్ని మతాల సమ్మేళనము సర్వ మతాలను సమానంగా చూసేది ఒక భారతదేశంలోనే అన్నారు. రంజాన్ పండుగకు ప్రధాన కారణం ముస్లింల పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ఈ నెలలోనే ఆవిర్భవించిందన్నారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన ఉపవాస దీక్షలు, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుంది అన్నారు. ఈ మాసంలో ముస్లింలు పవిత్రంగా నిష్టగా ఓపికతో ఉండి ఉపవాస దీక్షలు చేస్తారని చెప్పారు. ఈ రంజాన్ మాసంలో నియోజకవర్గ పరిధిలో ముస్లిం లందరికీ ఇఫ్తార్ విందును అందించడం ద్వారా అది మత సా సామరస్యానికి ప్రతీకగా సమాజానికి చాటి చెప్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, దేగ కొండయ్య, బాబు నాయక్, గుర్రం వెంకటరెడ్డి, ముత్తినేని కోటేశ్వరరావు, ఉపవాస దీక్షకులు పాల్గొన్నారు.

## హరీష్ రావు కు స్వాగతం పలికిన చల్లా



**జయభేరి, పరకాల, మార్చి 10:**

బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే బహిరంగ సభకు స్థల పరిశీలనకు హనుమకొండకు విచ్చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కి స్వాగతం పలికిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జక్కన్న యాక్షన్ పీక్స్‌లోనే..!

ప్రస్తుతం సినీ ప్రేక్షకులు అందరు రాజమౌళిమహేష్ బాబు సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవల ఒడిశాలో జరిగినట్లు తెలుస్తోంది. ప్రధాన పాత్రధారులు అందరు ఈ షెడ్యూల్‌లో పాల్గొనగా, రాజమౌళి కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. అయితే సెట్ నుండి ఓ వీడియో లీక్ కావడంతో జక్కన్నతో పాటు చిత్ర బృందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. లీకేజీ వ్యవహారంపై దర్శకుడు రాజమౌళి, చిత్రయూనిట్ కూడా సీరియస్‌గా ఉన్నారట. మరోవైపు రాజమౌళి టీమ్ ఈ వీడియోని నియంత్రించడానికి సైబర్ సెక్యూరిటీ సహాయం తీసుకొని ఆ వీడియో పోస్ట్ చేసిన ఫ్యాన్స్, నెటిజన్ల అకౌంట్స్ చేసేస్తున్నట్టుగా తెలుస్తుంది. దీంతో వీడియో పోస్ట్ చేసిన వాళ్లంతా గగ్గోలు పెడుతున్నారు. ఎందుకు పోస్ట్ చేశామా అని బాధపడుతున్నారు. ఇక వీడియో లీక్ కావడంతో మహేష్ మూవీ టీమ్ మరింత సెక్యూరిటీని పెంచాలని చూస్తున్నారట. సినిమా నుంచి ఎలాంటి లీక్స్ అవ్వకూడదు అని ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీని మూడింతలు పెంచుతున్నారని తెలుస్తుంది. ఒరిస్సా అడవుల్లో భారీ సెక్యూరిటీ నడుమ మూవీ టీమ్ తప్ప ఎవరికీ ప్రవేశం లేకుండా దరిదాపుల్లో ఎవరూ ఫోన్స్ వాడకుండా టైట్ సెక్యూరిటీని పెంచాలని రాజమౌళి భావిస్తున్నారట. ప్రస్తుతానికి ఈ సినిమా ఒరిస్సా అడవుల్లో షూటింగ్ జరుగుతుంది. మహేష్ బాబు – విలన్స్ మధ్య షూట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది.. ఇక్కడ ఆఫ్రికాలో ఉండే స్పెషల్ బాంబో చెట్లు సెట్స్ వేయిస్తున్నారని కూడా తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా జాన్ అబ్రహం, పృధ్విరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇన్నాళ్లు ఇన్‌డోర్ లో మూవీ షూటింగ్ జరిగింది కాబట్టి ఎలాంటి సమస్య లేదు. ఇప్పుడు ఔట్‌డోర్ షూటింగ్ అయ్యే సరికి రాజమౌళి అండ్ టీమ్‌కి అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.



# అదిదా సర్‌ప్రైజ్..

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. శ్రీలీల కథానాయిక. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. సోమవారం 'అదిదా సర్‌ప్రైజ్..' పేరుతో ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఇందులో కేతికశర్మ నర్తించింది. చంద్రబోస్ రాసిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు. జీవీ ప్రకాష్ కుమార్ స్వరకర్త. హుషారెత్తించే మాస్ పాట ఇదని, ఈ ఏడాది హాటెస్ట్‌సాంగ్‌గా నిలుస్తుందని, శేఖర్ మాస్టర్ నృత్యరీతులు ప్రధానాకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం పేర్కొంది. హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' చిత్రాన్ని తెరకెక్కించారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచనదర్శకత్వం: వెంకీ కుడుముల.

# సోషల్ మీడియా నేపథ్యంలో..

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'శారీ'. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవిశంకర్ వర్మ నిర్మాత. యదార్ధ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో సత్య యాదు, ఆరాధ్యదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ నెల 21న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా మేడ్చల్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాల విద్యార్థులతో చిత్రబృందం ఇంటరాక్ట్ అయ్యారు. అగ్రదర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, హీరోహీరోయిన్లు సత్య, ఆరాధ్యదేవి, నిర్మాత రవిశంకర్‌వర్మ, రామ్‌గోపాల్‌వర్మ సోదరి విజయ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుత సమాజంపై సోషల్‌మీడియా ప్రభావం ఎంతవరకు ఉంది అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలను చిత్రబృందం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెండువేల మంది విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు. సమాజంపై సోషల్‌మీడియా విష ప్రభావం ఎలాంటి పరిణామాలకు దారితీస్తున్నది? అనే అంశంపై తీసిన సినిమానే 'శారీ' అనీ, నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమా చేశామని రామ్‌గోపాల్‌వర్మ తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులంతా మాట్లాడారు.






# సగమై.. చెరిసగమై..

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో భక్తిరస ప్రధానంగా రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్ప'. పరమ శివభక్తుడు కన్నప్ప ఇతివృత్తమిది. ఏప్రిల్ 25న విడుదలకానుంది. ఈ సినిమా నుంచి 'సగమై...చెరిసగమై' అంటూ సాగే ఓ మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. స్టీఫెన్ దేవస్సీ స్వరాల్ని అందించిన ఈ గీతాన్ని రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. శ్రీమణి రచించారు. ఈ పాటలో నాయకానాయికలు మంచు విష్ణు, ప్రీతి ముకుందన్‌ల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్ శివుడిగా, ప్రభాస్ రుద్రుడిగా, కాజల్ అగర్వాల్ పార్వతీదేవిగా కనిపించనున్నారు. మోహన్‌లాల్, మోహన్‌బాబు, బ్రహ్మానందం వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com